క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి వేణుప్రసాద్

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సీహెచ్ వేణుప్రసాద్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కామన మధుసూదనరావు శనివారం తెలిపారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ అండర్-17 విభాగంలో వేణుప్రసాద్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వేణుప్రసాద్‌ను హెచ్ఎం గరిమెళ్ల స్వామిప్రసాద్, పీడీ కుమార్‌గౌడ్ తదితరులు అభినందించారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: ఫొటోగ్రాఫింగ్ వృత్తినే నమ్ముకుని ఉన్న ఫొటో, వీడియోగ్రాఫర్‌లను ప్రభుత్వం అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని లూయిస్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఆయన అధ్యక్షతన అసోసియేషన్ మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి జాన భవానీశంకర్, బొక్కా పుల్లంశెట్టి, జంగా రవికుమార్, చోడిశెట్టి ఆదినారాయణ, ముంగండ సత్తిబాబు, దేవదాసు రాజేష్, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా స్క్రీన్‌పై వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్


అమలాపురంలో మెగా స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న అభిమానులు

అమలాపురం టౌన్: వరల్డ్ కప్‌లో భాగంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఇండియా, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను అమలాపురం ఎర్ర వంతెన వద్ద ఏర్పాటుచేసిన మెగా స్క్రీన్‌పై ప్రదర్శించారు. టీమిండియా విజయం సాధించిన ఈ మ్యాచ్‌ను అభిమానులు ఆద్యంతం ఉత్కంఠగా వీక్షించారు.

దళిత సదస్సును జయప్రదం చేయాలి

తాళ్లరేవు: ఈ నెల 15న కాకినాడలో జరిగే దళితుల సదస్సును జయప్రదం చేయాలని మండల సీపీఎం పార్టీ కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ దేశంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్.త్రిమూర్తులు, ఎం.తణుకురాజు, కమిడి ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతిని బీజేపీ సమర్థించడం లేదు

అమలాపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అవినీతిని బీజేపీ పార్టీ సమర్థించడం లేదని, ఆయన్ని అరెస్టు చేసిన విధానాన్ని మాత్రమే ఖండించిందని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్ రాజు అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టులో బీజేపీ ప్రభుత్వ హస్తం ఉందన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా మానేపల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, కర్రి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తానేల్లంక మొల్లిలో శౌర్య జాగరణ యాత్ర


తానేల్లంక మొల్లిలో శౌర్య జాగరణ యాత్ర

ముమ్మిడివరం: విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన శౌర్య జాగరణ యాత్ర శనివారం ముమ్మిడివరం మండలం తానేల్లంక మొల్లికి చేరుకుంది. స్థానిక సమరత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక విజయగణపతి ఆలయం వద్ద హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

ఆటో అన్నలకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ వాహన మిత్ర పథకంతో ఏటా సాయం
- అమలాపురం నియోజకవర్గంలో 5,010 మందికి రూ.5 కోట్ల లబ్ధి


అమలాపురంలో వాహనమిత్ర 5వ విడత సొమ్ము జమవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో యజమానులు

ఉప్పలగుప్తం: రాష్ట్ర రవాణా రంగంలో ఉపాధి పొందుతున్నవారికి వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఓ వరంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఆటోలు, క్యాబ్‌లు కొనుగోలు చేసుకుని, రోజువారీ వేతనాలతో జీవనాన్ని నెట్టుకొస్తున్న వాహన కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక భరోసా కల్పించింది. ఏటా ఒక్కొక్కరి ఖాతాలో రూ.10 వేల చొప్పున జమ చేస్తూ వస్తుంది. గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహనదారులకు సాయం అందిస్తుందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలో ఐదు విడతల్లో సాయం

గత టీడీపీ హయాంలో వాహన పెట్టుబడులతో పాటు బీమా, పన్నులు అదనపు భారంగా మారటంతో వాహన యజమానులు అవి చెల్లించలేక పోయేవారు. రికార్డులు తనిఖీ చేసే క్రమంలో రవాణా శాఖాధికారులు అధిక జరిమానాలు విధించేవారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆటో, క్యాబ్ కార్మికులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తాము అధాకారంలోకి రాగానే న్యాయం చేస్తామన్న సీఎం జగన్ ఆటో, క్యాబ్ డ్రైవర్‌లపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్సార్ వాహనమిత్ర పథకంతో ఏటా రూ.10 వేల చొప్పున నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నారు. ఇప్పటికి నాలుగు సంవత్సరాల్లో ఐదు విడతల్లో నగదును జమ చేశారు. సొంత వాహనం ఉండి అర్హులైన ఆటో, క్యాబ్, ఎండీయూ(రేషన్ వాహన నిర్వాహకులు) డ్రైవర్‌లకు వారి ఖాతాల్లో రూ.50 వేలు నగదు జమైంది. కరోనా వంటి విపత్కర సమయంలోనూ ఈ పథకం ద్వారా నగదు చెల్లించటం చాలా కుటుంబాలకు జీవనాధారంగా మారింది. గత నెల 29న సీఎం జగన్ 5వ విడత నగదును విజయవాడలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

అమలాపురం నియోజకవర్గంలో వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధి వివరాలు

మండలం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.లలో)
అమలాపురం	2232	2,23,20,000
ఉప్పలగుప్తం	1204	1,20,40,000
అల్లవరం	1574	1,57,40,000

వాహనదారుల హర్షం

ఒక్క అమలాపురం నియోజకవర్గంలోనే 5,010 మంది లబ్ధిదారులకు మొత్తంగా రూ.5.01 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి. ఏటా ఇస్తున్న వాహన మిత్ర సొమ్ము వాహనాలకు చిన్న చిన్న మరమ్మతులు, బీమా, పన్నులకు సాయపడుతుందని వాహన యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వ చేయూతతో ప్రతిఒక్కరూ వాహన రికార్డులన్నీ కచ్చితంగా నిర్వహించుకుంటున్నారు. రికార్డు అంతా సిద్ధంగా ఉండటంతో రవాణా అధికారులు వాహనాల తనిఖీ సమయంలో జరిమానాలు విధించే పరిస్థితి లేదని డ్రైవర్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాటకు కట్టుబడి ఇస్తున్నారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిన్నవాహనదారుల కష్టాలను గుర్తించి పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఏటా వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాకు ఐదు విడతల్లో రూ.50 వేలు అందింది. ఈ సొమ్ము మాకు వాహన నిర్వహణకు చాలా ఉపయోగపడుతుంది.

– నల్లా దుర్గారావు, లబ్ధిదారుడు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

కరోనా సమయంలోనూ ఆదుకున్నారు



కరోనా వంటి విపత్కర సమయంలో ఆటో నడిపేందుకు అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అలాంటి సమయంలోనూ మాకు వాహనమిత్ర సొమ్ము వేయడం చాలా ఉపయోగపడింది. నాకు ఐదు విడతల్లో రూ.50 వేలు ఇచ్చారు. సీఎం జగన్ పరిపాలన చాలా బాగుంది.

– నెల్లి వెంకటేశ్వరరావు, లబ్ధిదారుడు, గూడాల, అల్లవరం మండలం

పారదర్శకంగా అమలు



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వాహనమిత్ర పథకం పారదర్శంగా అమలుచేస్తున్నాం. ఇప్పటికే 5వ విడత సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఎవరికైనా సాంకేతిక లోపాలతో సొమ్ము చేరకపోతే దాన్ని సరిచేసి సొమ్ము అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం.

– కె.వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీడీవో, ఉప్పలగుప్తం మండలం

అదనపు గది ప్రారంభం


యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అదనపు గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అదనంగా నిర్మించిన గదిని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. అలాగే ఉపాధ్యాయుల విరాళాలతో సమకూర్చిన జనరేటర్‌ను యూనియన్ ప్రతినిధులు దంగుడుబియ్యం శ్రీరామమూర్తి ప్రారంభించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షన్ విధానంపై ఉపాధ్యాయులు చర్చించారు. పాత పెన్షన్ విధానమే కావాలంటూ ఉపాధ్యాయులు నిర్వహించిన పోస్ట్ కార్డు శిబిరాన్ని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మొదలుపెట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జ్యోతిబసు, డీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శిగా అయితాబత్తుల సుభాషిణి

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు నియామక ఉత్తర్వులిచ్చారు. తనకు పదవి వచ్చేలా సహకరించిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి తదితరులకు సుభాషిణి కృతజ్ఞతలు తెలియజేశారు.

పూర్తయిన ఆధునీకరణ పనులు

- నేడు ప్రారంభం కానున్న తాగునీటి ప్లాంట్


ప్రారంభానికి సిద్ధమైన ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు

అమలాపురం టౌన్: పట్టణ తాగునీటి సరఫరాకు సంబంధించిన వాటర్ వర్క్స్‌లో నీటి శుద్ధీకరణ ప్లాంట్‌కు రూ.35 లక్షలతో చేపట్టిన మరమ్మతులు, ఆధునీకరణ పనులు శనివారంతో పూర్తయ్యాయి. ప్లాంట్‌లో శుద్ధీకరణ పరికరాల్లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలుచోట్ల కుళాయిల ద్వారా నీరు రంగుమారి రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై కౌన్సిలర్లు సైతం కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై గళమెత్తారు. ఎట్టకేలకు మరమ్మతులు, ఆధునీకరణ పనులు పూర్తవడంతో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు శనివారం ప్లాంట్‌ను సందర్శించి ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కూడా ఇటీవల రెండు పర్యాయాలు వాటర్ వర్క్స్‌ని సందర్శించి పలు సూచనలు చేశారు. ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించనున్నారు.

స్టెయిన్‌లెస్ స్టీల్ పరికరం ఏర్పాటు

ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేసే క్లారీఫ్యూక్లైటర్ పరికరం ఇనుప లోహానిది కావడం వల్ల తరచూ తుప్పు పట్టి మరమ్మతులకు గురై కుళాయిల నుంచి రంగు మారిన నీరు వస్తుంది. అందుకే ఈసారి ఇనుప క్లారీఫ్యూక్లైటర్ పరికరాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీలుతో తయారు చేసిన అధునాతన పరికరాన్ని అమర్చామని మున్సిపల్ ఏఈ భాస్కరరావు తెలిపారు. ఇక నుంచి కుళాయిల నుంచి నాణ్యమైన తాగునీరు సరఫరా అవుతుందన్నారు.

దసరా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీఎస్పీ అంబికా ప్రసాద్


పేరూరులో భేతాలస్వామి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: అమలాపురం మండలం పేరూరు గ్రామంలో దసరా సందర్భంగా నిర్వహించే రెండు భేతాళ స్వామి ఆలయాల వద్ద ఊరేగింపు, ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు. గ్రామంలోని ఆలయాల వద్ద కమిటీ ప్రతినిధులతో శనివారం జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకూ నిర్వహించే ఉత్సవాలు, ఊరేగింపుల బందోబస్తుపై వారితో చర్చించారు. గ్రామంలో జరిగే ఊరేగింపులో అశ్లీల నృత్యాలకు, డీజేలకు ఏ మాత్రం అనుమతులు ఉండవని డీఎస్పీ స్పష్టం చేశారు. ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించేందుకు పేరూరు గ్రామప్రజలందరం పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని కమిటీ డీఎస్పీ అంబికాప్రసాద్‌కు హామీ ఇచ్చింది. ఊరేగింపు గ్రామస్తులంతా ఒక మాట మీద ఉండి క్రమశిక్షణతో జరుపుకోవాలని పట్టణ సీఐ టి.క్రాంతి కుమార్ సూచించారు.

నేటి నుంచి మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు


యానాం భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారు

యానాం: చరిత్ర ప్రసిద్ధి గాంచిన యానాం శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. స్వామివారి ఉత్సవాలను ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థాన ఆలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖండవిల్లి రామకృష్ణ తెలిపారు. వేద పండితులు శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, పెద్దింటి సాయిరామకృష్ణలచే స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ తరలివచ్చి జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్ చిరంజీవి

అమలాపురం రూరల్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ గుత్తుల చిరంజీవి అన్నారు. సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఉప్పే సత్యనారాయణ ఏడుగురు విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్, పాఠశాలకు 8 ఫ్యాన్లు శనివారం బహూకరించారు. అదేవిధంగా ఉపాధ్యాయ సంఘం నేత సరిదే సత్యపల్లంరాజు ఆరుగురు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ టెస్ట్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సర్పంచ్ చిరంజీవి, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణల చేతుల మీదుగా వాటిని బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాబూరావు, ఉపాధ్యాయులు పోతంశెట్టి దొరబాబు, కుడుపూడి విజయలక్ష్మి, వెంబరాల సూర్యనారాయణ, మట్టపర్తి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోడూరుపాడులో చోరీ

అల్లవరం: మండలంలోని కోడూరుపాడు పంచాయతీ పరిధి ఆకులవారి వీధిలో కురసాల దొరబాబు ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు దొరబాబు భార్య కురసాల మంగాదేవి శనివారం అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. తన తండ్రి ఆకుల గంగరాజుకు ఇటీవల రాజమహేంద్రవరంలో ఆపరేషన్ చేయించామని, ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీకి పాల్పడ్డారని మంగాదేవి తెలిపింది. ఇంట్లోని 2.5 గ్రాముల బంగారు తాడు, మంగళసూత్రాలు, చెవి దిద్దులు, రూ. 20 వేల నగదును చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొంది. సంఘటన స్థలాన్ని సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఏఎస్సై జంగా సత్యనారాయణ తెలిపారు.

తాచుపాము హల్ చల్


తాచుపామును బంధిస్తున్న వర్మ

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన పచ్చిమట్ల వెంకటేశ్వరరాజు ఇంట్లో శనివారం తాచుపాము హల్ చల్ చేసింది. పాము ఇంట్లోకి చొరబడటంతో కుటుంబసభ్యులంతా భయభ్రాంతులకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన స్నేక్ కాచర్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి తాచుపామును ప్లాస్టిక్ బాటిల్‌లో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నా కుమారుడిని ఆదుకోండి


ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందు

అల్లవరం: రెండు కిడ్నీలు పాడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన కుమారుడు పోతుమూడి చందు(19)ని ఆదుకోవాలంటూ అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన రోహిణి శ్రీను విజ్ఞప్తి చేశారు. కాకినాడలో ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందుకి రెండు కిడ్నీలను మార్చవలసి ఉందని, దీనికి కనీసం రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొస్తే తన కుమారుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతాడన్నారు.

నేషనల్ గేమ్స్ రిఫరీగా వెంకన్న


నేషనల్ గేమ్స్‌కు రిఫరీగా ఎంపికైన చింతా వెంకన్న

యానాం: జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు టెక్నికల్(రిఫరీ) అఫిషియల్‌గా యానాంకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ చింతా వెంకన్నను నియమిస్తూ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ కమిటీ చైర్మన్ స్టాన్లీ జోన్స్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గోవాలో ఈ నెల 29 నుంచి నవంబర్ 3 వరకూ జరిగే 37వ నేషనల్ గేమ్స్(అథ్లెటిక్స్)-2023కు వెంకన్న రిఫరీగా వ్యవహరించనున్నారు. వెంకన్న స్థానిక శారదా విద్యానికేతన్ ప్రభుత్వ ఎయిడెడ్ పీఈటీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వెంకన్నను పుదుచ్చేరి ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు, కాపగంటి ఉమాశంకర్, సురేష్, సుబ్బారావు, భూషణ అభినందించారు.

శస్త్రచికిత్సకు సాయం


ఆదిలక్ష్మికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో తలకి గాయమైన వ్యక్తికి శస్త్ర చికిత్స కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు నగదు సాయం అందజేశారు. కాకినాడకి చెందిన దున్నా వీరబాబు గతంలో వెల్డింగ్ పని చేస్తుండేవాడు. రెండు సంవత్సరాల క్రితం బిల్డింగ్ మీద నుంచి పడిపోవడంతో అతని తలకి సర్జరీ చేశారు. కానీ పూర్తిగా కోలుకోలేదు. తరచుగా ఫిట్స్ వస్తున్నాయి. మళ్లీ ఇంకో సర్జరీ చేయకపోతే ప్రాణాపాయం అని డాక్టర్లు చెప్పారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వీరు కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులను వైద్యానికి సహాయం కోరారు. దీంతో శనివారం రావులపాలెంలో వీరబాబు తల్లి ఆదిలక్ష్మికి సంస్థ తరపున రూ.12 వేలు నగదు సాయాన్ని అందజేశారు.

అమ్మవారి ఆలయాల ముస్తాబు


మురమళ్లలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం

ఐ.పోలవరం: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల కోసం మండలంలోని మురమళ్ల, కొమరగిరి, కేశనకుర్రు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భారీ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేశారు. మురమళ్ల వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు జరుపుతారు.

తాళ్లరేవు: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని తాళ్లరేవు, కోరంగి, జార్జిపేట, సుంకరపాలెం, ఇంజరం, చొల్లంగి, పి.మల్లవరం తదితర గ్రామాల్లో ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.

నేటి నుంచి దేవీ నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో తాళ్లరేవు కనకదుర్గమ్మ

యానాం: స్థానిక కనకాలపేటలోని దుర్గాదేవి ఆలయంలో 38వ దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దుర్గాదేవి, అభయ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీ ఆదివారం ఉదయం 6.56 గంటలకు బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తిశర్మ ఆధ్వర్యంలో కలశస్థాపన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. 25న అమ్మవారి భారీ ఊరేగింపు, 28న అన్నసమారాధన ఉంటాయన్నారు.

చిన్నారుల నవదుర్గల వేషధారణ


నవదుర్గలు, సీతారామలక్ష్మణుల వేషధారణలో చిన్నారులు

అమలాపురం టౌన్: విజయదశమి వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక సహస్ర స్కూలుకు చెందిన విద్యార్థులు నవదుర్గలు, సీతారామలక్ష్మణుల వేషధారణలతో అలరించారు. అనంతరం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గౌసియా బేగం పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి


ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అమలాపురం రూరల్: ప్రభుత్వ పథకాల అమలుకు కొబ్బరి రైతులంతా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు సూచించారు. అమలాపురం మండలంలో కామనగరువు, చిందాడగరువు గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదును నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని వ్యవసాయ సహాయకులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఏ షంషి, మండల వ్యవసాయ అధికారి కడలి ధర్మ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిశ్రీ, రమణి, దివ్య పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యానాం: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయిలో ఈ నెల 15 నుంచి 19 వరకూ నిర్వహించనున్న 42వ సబ్ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ నుంచి ఏడుగురు క్రీడాకారులు పుదుచ్చేరి జట్టుకు ఎంపికయ్యారని పీఈటీ బొట్టా శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బళ్లా ప్రవళిక, ఆలపాటి సంజన, గుర్రాల శ్రీవల్లి, కర్నీడి శివసత్యకిషోర్, వాకపల్లి శశిధర్, పాలెపు యోనంత్, కట్టుంగి మణిదీప్ ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను బ్యాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేష సుమన్ అభినందించారు.

బంగారు దుకాణాల బంద్


వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం బులియన్ అసోసియేషన్ సభ్యుడు మానే వెంకటేశ్వరరావు మృతికి సంతాప సూచకంగా శనివారం పట్టణంలోని బంగారు, వెండి వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. స్థానిక బులియన్ అసోసియేషన్ భవనం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు అధ్యక్షతన వ్యాపారులు సమావేశమై వెంకటేశ్వరరావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, కార్యదర్శి రాయుడు వీరాస్వామి నాథన్, చవాకుల కృష్ణ, చింతలపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.